సాక్షి
జగిత్యాల

శుక్రవారం। 14 । జూలై । 2023



రవాణా శాఖ అధికారికి సన్మానం

జగిత్యాలరూరల్: జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్‌ను గురువారం జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి సన్మానించారు. అంజిరెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.



రాజన్న ఆదాయం లెక్కింపు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిల్వ చేసి ఉంచిన నాణేలను రెండు రోజులుగా లెక్కిస్తున్నారు. గురువారం రూ.40,72,500 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

నాణ్యమైన ఆహారం అందించాలి



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఫుడ్ ఆఫీసర్ బాపూజీ

జగిత్యాల: వినియోగదారులకు నాణ్యమైన ఆహారమే అందించాలని ఫుడ్ ఆఫీసర్ బాపూజీ అన్నారు. గురువారం పికప్ పాయింట్‌లో హోటల్ యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎలాంటి కల్తీ లేకుండా వినియోగదారులకు ఆహార పదార్థాలు అందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా శుచి, శుభ్రత పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదస్సులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి మోహన్, వ్యాపారులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఈనెల 15న ఇంటర్ ఫస్టియర్‌కు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గురువారం సంబంధిత అధికారులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని, పదోతరగతి రెగ్యులర్ పాస్ అయిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించాలి



సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాలు జరిగితే అక్కడున్న వారు వెంటనే స్పందించి క్షతగాత్రులను సత్వరమే ఆస్పత్రిలో చేర్చాలని వైద్యులు సంతోష్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శివకుమార్ అన్నారు. పెట్రోల్‌బంక్‌లో పనిచేసేవారికి, పండ్ల కొట్టు నిర్వాహకులు, పంక్చర్ షాపుల నిర్వాహకులకు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సాయంత్రం పట్టణపోలీస్‌స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్నవారు మానవతా దృక్పథంతో జాప్యం చేయకుండా వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ చేయాలన్నారు. ఆ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నటేశ్, ఎస్సైలు అబ్దుల్ రహీం, సంజీవ్, రమేశ్, పురుషోత్తం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: తెలంగాణ డయాగ్నోస్టిక్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన మైక్రో బయాలజిస్ట్-1, బయోకెమిస్ట్రీ-1, ఫార్మాసిస్ట్-1 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. అభ్యర్థులు నోటిఫికేషన్ వివరాలను jagtial.telangana.gov.in నుంచి పొంది పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను అవసరమైన అన్ని సర్టిఫికెట్లను జతచేసి ఈనెల 14 నుంచి 21 వరకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దాఖలు చేయాలని పేర్కొన్నారు.

చిన్నతరహా ఆహార సంస్థలు నెలకొల్పాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

జగిత్యాల: చిన్నతరహా ఆహార తయారీ సంస్థలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని ఉమ్మడి జిల్లా మానిటరింగ్ అధికారి రామకృష్ణ అన్నారు. గురువారం జగిత్యాలలో సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల ఏర్పాటు కోసం మెప్మా రిసోర్స్ పర్సన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల క్రమబద్ధీకరణ పథకం కింద ఆహార ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. ఇవి నెలకొల్పుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ సైతం ఇస్తాయని వివరించారు. మహిళలు ఆర్థిక పురోగతి పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ వెంకటేశ్, మెప్మా డీఎంసీ సునీత, టీఎంసీ రజిత పాల్గొన్నారు.

‘వేసెక్టమీ’కి వెనుకంజ!

- జిల్లాలో ఒకే ఒక్క డాక్టర్
- అవగాహన కల్పించరు.. శిబిరాలు నిర్వహించరు
- కు.ని.కి ముందుకు రాని పురుషులు



జగిత్యాల: 'చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం.. ఒక్కరు ముద్దు.. ఇద్దరు వద్దు' అన్న నినాదం కనుమరుగవుతోంది. జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరగడం లేదు. పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నా.. వాటిలో సర్జన్స్ లేకపోవడం, ఒక డీఎంహెచ్‌వో మాత్రమే ఉండగా, ఆయనకు ఇతర బాధ్యతలు ఉండడంతో కు.ని ఆపరేషన్లు చేసేవారు కరువయ్యారు. ప్రస్తుతం డీఎంహెచ్‌వోనే అప్పుడప్పుడు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరుగుతోంది. కాగా కు.ని ఆపరేషన్లు చేసుకునేందుకు ఎక్కువ మంది పురుషులు సంకోచిస్తున్నారు. ఫలితంగా అధిక సంఖ్యలో ఆడవారే ఆపరేషన్లు చేసుకుంటున్నారు. సిబ్బంది లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై వైద్యశాఖ పూర్తిగా అవగాహన కల్పించడం లేదు. శిబిరాలు నిర్వహించకపోవడంతో జిల్లాలో దాదాపు వేసెక్టమీ ఆపరేషన్లు నిలిచిపోయాయి. జిల్లాలో ఒక్కరే సర్జన్ డీఎంహెచ్‌వోగా ఉండటంతో పూర్తిస్థాయిలో వేసెక్టమీ చేయలేకపోతున్నారు. దీంతో ఎక్కువ శాతం మహిళలే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

మహిళలే అధికం

జిల్లాలో గత ఆరు సంవత్సరాల్లో 10,338 మంది మహిళలు ట్యుబెక్టమీ ఆపరేషన్లు చేయించుకోగా పురుషులు కేవలం 1,981 మంది మాత్రమే ఆపరేషన్లు చేయించుకున్నారు. రెండో ప్రసవ సమయంలో ఆస్పత్రికి వచ్చిన వారు సిజేరియన్‌తో బాబుకు జన్మనిస్తే దాంతో పాటే ట్యుబెక్టమీ చేయించుకుంటున్నారు. మహిళలకు ఒకవైపు సిజేరియన్‌తో అనేక ఇబ్బందులుంటే ట్యుబెక్టమీ ఆపరేషన్లు చేసుకుంటే మరింత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. వేసెక్టమీ ఆపరేషన్లు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండకపోవడంతో పాటు ఇన్ఫెక్షన్లు సోకవు. ఆపరేషన్ అయిన అరగంటలోపే వెళ్లిపోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రిలో వేసెక్టమీ చేయించుకుంటే రూ.1500, ట్యుబెక్టమీకి రూ.800 ప్రోత్సాహం అందిస్తారు.

జిల్లాలో కు.ని ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	మహిళలు	పురుషులు
2018-19	1,537	470
2019-20	1,706	474
2020-21	1,028	442
2021-22	2,246	367
2022-23	3,821	228(జూలై12)
మొత్తం	10,338	1,981

శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం



జగిత్యాలలో ఒకేఒక్కరు వేసెక్టమీ సర్జన్ ఉండటంతో ఇబ్బందికరంగా ఉంది. అయినప్పటికీ కొన్ని చోట్ల ఆపరేషన్లు చేస్తున్నాం. శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. మహిళలకన్నా కు.ని ఆపరేషన్ పురుషులే చేయించుకోవడం మేలు.

– పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో

నకిలీ ఓటర్లను తొలగించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: 18 సంవత్సరాలు నిండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, నకిలీ ఓటర్లను గుర్తించి తొలగించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని పోలింగ్ స్టేషన్లు వ్యక్తిగతంగా తనిఖీ చేసి ఎన్నికల విభాగానికి సంతకం చేసిన కాపీని అందజేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన విధివిధానాలను అనుసరించి పోలింగ్ కేంద్రాన్ని ఖరారు చేయడం, ఎన్నికల విభాగానికి అవసరమైన ప్రోఫార్మాలో నివేదికలు తయారుచేసి రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. ఈ మార్గదర్శకాలను అనుసరించి సవరించిన షెడ్యూల్ ప్రకారం 6,7,8 ఫారంలను క్లియర్ చేయాలన్నారు. పీఎస్ వారీగా బూత్‌స్థాయి ఏజెంట్ల నియామకం కోసం రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లత, మకరంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కార్యాచరణ

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరిగిందని, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుకు వెళ్లడం తప్పదని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పోలీస్ శాఖ ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల భాగస్వామ్యంతోనే ప్రమాదాలను పూర్తిగా నివారించగలమన్నారు. డీజీపీ ఆదేశాల మేరకు ఎస్పై ఆధ్వర్యంలో జిల్లా ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరో ప్రారంభించి ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ కళా బృందం ద్వారా జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హైవేలపై జరిగే యాక్సిడెంట్‌లకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్‌గా ఉండేందుకు పెట్రోల్ బంక్, దాబాలో పనిచేసేవారు, యూత్, గ్రామస్తులకు ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌పై అవగాహన కలిగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ర్యాష్ డ్రైవింగ్, విత్ ఔట్ నంబర్ ప్లేట్, డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే జరిమానా, జైలు

జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో 4,723 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ వివరించారు. ఆటో డ్రైవర్లకు నిబంధనలు వివరించడంతోపాటు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు నియమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎస్పీలు రవీంద్రకుమార్, శ్రీనివాస్, ఎస్సై రఫీక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: సంక్షేమ పథకాలు అందివడంలో తెలంగాణ దేశానికే ఆదర్శమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ర్యాగల్ల నారాయణ, ఎర్ర మోహన్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను చూసి చాలా మంది బీఆర్ఎస్‌లో చేరారని కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం జైనా గ్రామంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జిల్లాలో జగిత్యాల డివిజన్ ఆర్డీవో మాధురి, కోరుట్ల డివిజన్ ఆర్డీవో వినోద్‌ను నియమించగా, ధర్మపురి నియోజకవర్గానికి అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) మంద మకరంద్‌ను రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కోరుట్ల ఆర్డీవోగా ఉన్న వినోద్ ఇప్పటికే బదిలీ అయినా రిలీవ్ కాలేదు. ఇందులో సైతం బదిలీలు జరిగే అవకాశం ఉంటుంది. అప్పుడు ఏ అధికారి ఉంటే ఆ అధికారి ఎన్నికల అధికారిగా ఉంటారు.

‘నోటిఫికేషన్ లేకుండానే కో ఆర్డినేటర్ నియామకం’

జగిత్యాల: మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎజెండా అంశం 31 ద్వారా హరితహారం కో–ఆర్డినేటర్‌గా బాలె శేఖర్‌ను ఎలాంటి పేపర్ ప్రకటన లేకుండానే నియమించారని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ ఆరోపించారు. గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమావేశంలో కో–ఆర్డినేటర్‌గా ఏర్పాటు చేస్తున్నామని చెప్పి రూ.40 వేల జీతంగా ఎజెండాలో పొందుపర్చగా అందుకు కౌన్సిలర్లు అందరూ రూ.20 వేల చొప్పున ఇద్దరిని తీసుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. కానీ ఇందుకు విరుద్ధంగా నియామకం చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు.

మెడికల్ హబ్‌గా జగిత్యాల

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో 66 మందికి రూ.24.87 లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులు అందజేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరంగా మారిందన్నారు. రూ.200 కోట్లతో మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయని, విద్య, వైద్యంలో జగిత్యాల అగ్రస్థానంలో ఉందన్నారు. జగిత్యాల ఆస్పత్రిలో 110 మంది వైద్యులున్నారని, ప్రస్తుతం నరాలు, గుండె, కిడ్నీ, క్యాన్సర్ తదితర వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని ఉపయోగించుకోవాలని, ఇందులో 134 వ్యాధులకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఏవైనా లోపాలుంటే తన దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామన్నారు. కాగా ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్ సందర్శనకు డిగ్రీ విద్యార్థులు



సాఫ్ట్‌వేర్ పరికరాలు పరిశీలిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తృతీయ సంవత్సరం విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని టీ– హబ్, టీ– వర్క్స్, వీ– హబ్ సందర్శనకు వెళ్లారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ సొంత ఖర్చులతో 150 మంది విద్యార్థులను హైదరాబాద్ తీసుకెళ్లి టీ హబ్, టీ వర్క్స్, ఇంక్యూబేటర్ కంపెనీలను సందర్శించి సాఫ్ట్‌వేర్ పరికరాలను పరిశీలించారు.

15న విద్యార్థులకు కథల పోటీలు

కోరుట్ల: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఈనెల 15న పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ ఆర్.కృష్ణమూర్తి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మంచాల జగన్ గురువారం ప్రకటనలో తెలిపారు. కథ చెబుతారా ఊ కొడతార కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఏడు చేపల కథ, నాన్నా పులి కథ, ఒకనాటి బాల్యం గడిచేది కాదని అనే అంశాలపై 5 నిమిషాల వ్యవధిలో వివరించాల్సి ఉంటుందన్నారు. 10 ఏళ్ల లోపు, 10 నుంచి 15 ఏళ్ల లోపు వారికి రెండు విభాగాల్లో ఉంటుందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదుతో పాటు, టీటీడీ ప్రశంసాపత్రం అందజేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 73969 50725, 98851 76157 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ధాన్యాగార ఖిల్లా.. జగిత్యాల జిల్లా

- ఆధునిక పద్ధతులు.. పుట్లకొద్ది వడ్లు
- యాసంగి సీజన్‌లో 42.06 లక్షల క్వింటాళ్ల వరిధాన్యం ఉత్పత్తి
- విలువ రూ.866.45 కోట్లు

మండలాలవారీగా ఉత్పత్తి అయిన ధాన్యం(క్వింటాళ్లలో)

మండలం	ధాన్యం
బీర్‌పూర్	97,599
బుగ్గారం	1,01,308
ధర్మపురి	2,64,872
గొల్లపల్లి	2,90,010
ఇబ్రహీంపట్నం	1,42,533
జగిత్యాల	83,529
జగిత్యాలరూరల్	2,64,172
కథలాపూర్	3,37,940
కొడిమ్యాల	2,32,912
కోరుట్ల	2,68,257
మల్యాల	2,07,454
మల్లాపూర్	2,28,833
మేడిపల్లి	3,29,649
మెట్‌పల్లి	2,87,880
పెగడపల్లి	3,22,854
రాయికల్	1,98,659
సారంగాపూర్	1,80,894
వెల్గటూర్	3,66,720
మొత్తం	42,06,075



లక్ష్మీపూర్‌లో పండిన పంటను చూసి మురిసిపోతున్న రైతులు(ఫైల్)

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్రంలోనే వ్యవసాయాధారిత జిల్లాగా పేరుగాంచిన జగిత్యాల జిల్లా ఒకప్పుడు నక్సలైట్ల కంచుకోటగా ఉంటే, ఇప్పుడు రైతన్నల ఆధునిక సేద్యంతో ధాన్యం రాశులతో కళ కళలాడుతుంది. వరి ధాన్యం ఉత్పత్తిలో ధాన్యాగార ఖిల్లాగా మారిపోయింది. గడిచిన యాసంగి సీజన్‌లో రూ 866.45 కోట్ల విలువైన వరి ధాన్యం ఉత్పత్తి చేశారు. అయితే పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో దిగుబడులు కొంత మేర పడిపోయినా వడ్ల ఉత్పత్తిలో ముందు వరుసలో ఉండటం విశేషం.

ఆధునిక యాజమాన్య పద్ధతులు

జిల్లాలో ఒక్కటైండు మండలాలు మినహా మిగతా మండలాలకు ఎస్సారెస్పీ నీరు అందుతోంది. దీనికి తోడు ఎస్సారెస్పీ ఎగువన ఉన్న కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల మండలాలకు కాళేశ్వరం ప్రాజెక్టు, వరద కాల్వ ద్వారా నీరు అందుబాటులో ఉండటంతో పాటు రైతుల ఆధునిక సేద్యంతో ఉత్పత్తి పెరిగింది. గడిచిన యాసంగిలో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి మంచి దిగుబడులు సాధించారు. జిల్లాలోని వాతావరణ పరిస్థితులు వరికి అనుకూలంగా ఉండటంతో పాటు జగిత్యాల రైస్-1, ఎంటీయూ-1010, ఎంటీయూ-1001, ఐఆర్-64, బతుకమ్మ వంటి దొడ్డు రకాలను సాగు చేస్తుంటారు. నాణ్యమైన విత్తనం వాడటం, సరైన సమయంలో నార్లు పోయడం, నాట్లు వేయడంతో పాటు రసాయన ఎరువులను మూడు దఫాలుగా వేస్తుంటారు. ఏటా వానాకాలంలో వరి సాగు చేసే పొలాల్లో జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేసి భూమిని బలవర్ధకంగా తయారు చేస్తారు.

కొనుగోళ్లలోనూ నంబర్ వన్

ధాన్యం ఉత్పత్తిలోనే కాకుండా జగిత్యాల జిల్లా కొనుగోళ్లలోనూ నంబర్‌వన్‌గా ఉంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,060 చొప్పున 414 కేంద్రాలు ఏర్పాటు చేసి రూ 866.45 కోట్ల విలువైన 42,06,082 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 162 కేంద్రాల ద్వారా రూ 258.93 కోట్ల విలువైన 12,56,942 క్వింటాళ్లు, సింగిల్ విండోల ఆధ్వర్యంలో 252 కేంద్రాల ద్వారా రూ 607.52 కోట్ల విలువైన 29,49,133 క్వింటాళ్ల ధాన్యం కొన్నారు.

ప్రతి సీజన్‌లో..



వరిలో ప్రతి సీజన్‌లో మంచి దిగుబడులే వస్తాయి. గడిచిన యాసంగిలో తెగుళ్లు ఆశించడంతో కొంత మేర దిగుబడులు తగ్గాయి. ఆధునిక పరికరాలు రావడంతో వరి సాగు సులభతరమైంది. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,500 వరకు ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది.

– మిట్టపెల్లి రాములు, తుంగూర్, బీర్పూర్

ఇష్టంగా వ్యవసాయం చేస్తారు



జిల్లా రైతులు వ్యవసాయాన్ని ఇష్టంగా చేస్తారు. వినూత్న ఆలోచనలతో ఆధునికతను జోడించి పంటలు పండిస్తారు. జిల్లా వాతావరణం కూడా వరికి అనుకూలం. నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో అన్ని యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధిస్తుంటారు.

– పాక సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య



శ్రీవేణి (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): భర్త పెట్టే వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన శ్రీవేణి(31), కాకతీయనగర్‌కు చెందిన జోగినిపల్లి విజయ్ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబసభ్యులు సర్దిచెబుతున్నారు. ఈ క్రమంలో విజయ్ గురువారం భార్యతో గొడవపడి, ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కాసేపటికే శ్రీవాణి ఉరేసుకుంది. అల్లుడి వేధింపులు తాళలేకనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి గుండ రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకట్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

రైలులో నుంచి పడి యువకుడి మృతి



ఫైజల్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట్–బల్లార్షా సెక్షన్ల మధ్యలో పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడు రైలులో నుంచి కిందపడి, మృతిచెందాడు. రామగుండం జీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మదన్నపేట్‌కు చెందిన మహమ్మద్ ఫైజల్ (22) పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తల పగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



సువర్ణ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీకి చెందిన శాతవాహన మిత్ర మండలి సభ్యుడు కరుణాకర్‌రావు సోదరి మాదాసు సువర్ణ(55) బుధవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మంచిర్యాలలో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున ఐ టెక్నీషియన్ కిరణ్ ద్వారా సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. సువర్ణ భర్త రవీందర్‌రావు, కుమారుడు, కోడలు నవీన్ కుమార్–కౌముది, కూతురు, అల్లుడు వందన–నవీన్ కుమార్‌లను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

సమ్మెలో కార్మికులు.. గ్రామాల్లో నిలిచిన పనులు

- కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- ఐదు నెలల జీతాలు పెండింగ్
- జిల్లాలో 380 గ్రామాలు
- 1,534 మంది మల్టీపర్పస్ వర్కర్లు



రాయికల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

జగిత్యాలరూరల్: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీ పాలనపై మల్టీపర్పస్ వర్కర్ల సమ్మె తీవ్ర ప్రభావం చూపుతోంది. పంచాయతీల్లో పని చేస్తున్న ఈ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. మల్టీపర్పస్ విధానం అమలుతో పనిభారం పెరగడమే కాకుండా చాలీచాలని వేతనాలతో కాలం గడపాల్సి వస్తోందని, ఉద్యోగ భద్రత లేదని, నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6 నుంచి సమ్మెకు దిగారు.

రూ.9,500 వేతనం..

గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం కారణంగా అన్ని రకాల పనులు చేయించడం, సకాలంతో జీతాలు చెల్లించకపోవడం, చాలీచాలని వేతనాలు కార్మికులను సమ్మె వైపు నడిపాయి. వీరికి మొదట రూ.8,500 ఇచ్చేవారు. రెండు నెలల క్రితం రూ.1,000 పెంచగా వేతనం రూ.9,500కు చేరింది. ఈ కార్మికుల వేతనాల నుంచి స్థానిక అవసరాలను బట్టి నియమించుకున్న వారికి డబ్బులు ఇస్తున్నారు. దీంతో కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు. వారు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు, చెత్త తరలింపు, ట్రాక్టర్ నిర్వహణ, వీధి లైట్లు ఇతరత్రా పనులు నిలిచిపోతున్నాయి. జగిత్యాల జిల్లా పరిధిలో పని చేస్తున్న కార్మికులకు ఇప్పటికే ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకే..

జగిత్యాల జిల్లాలో 380 గ్రామాలుండగా.. 1,534 మంది మల్టీపర్పస్ కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500 వేతనాన్ని చెల్లించాలి. కానీ కొన్నిచోట్ల పంచాయతీ స్థానిక వనరులను బట్టి నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకే చెల్లిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు, వాటర్ మెన్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు చిన్న పంచాయతీల్లో గరిష్టంగా ఇద్దరు, పెద్ద పంచాయతీల్లో 25 మంది వరకు పని చేస్తున్నారు. గతంలో వీరికి ఎస్‌ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘాల నిధుల నుంచి వేతనాలు చెల్లించేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్సీ నిధులు నిర్ణీత వ్యవధిలో మంజూరు చేయడం లేదు.

డిమాండ్లు ఇవి..

- కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్లు, కారోబార్లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రతినెలా రెగ్యులర్‌గా జీతం ఇవ్వాలి.
- జీవో 51ను సవరించాలి. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి.
- ప్రతి కార్మికునికి ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలి.
- ఏడాదికి మూడు జతల యూనిఫాంలు, చెప్పులు, సబ్బులు, నూనెలు, నగదు రూపంలో అలవెన్సు ఇవ్వాలి.
- పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి. 8 గంటల పనిదినాలు అమలు చేయాలి. కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి. రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి.

డబ్బులు లేవంటున్నారు



గ్రామాల్లో మమ్మల్ని వివిధ రకాల పనులకు ఉపయోగిస్తున్నారు. ఇచ్చిన జీతాల్లో నుంచి అదనంగా పెట్టుకున్న వారికి పంచుతున్నారు. కనీస వేతనాలు అమలు చేసే వరకు మా పోరాటం ఆగదు. జీతాలకు చాలా గ్రామాల్లో డబ్బులు లేవంటున్నారు. కొన్నిచోట్ల 5 నెలలుగా వేతనం ఇవ్వడం లేదు. మేము, మా కుటుంబాలు ఎలా బతకాలి? ప్రభుత్వం మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– దేశవేని నరేశ్, కారోబార్, ధరూర్

కాపర్ ప్లేట్స్ చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



దొంగల అరెస్టు చూపుతున్న సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్

- ప్లేట్స్, బైక్, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ

మల్లాపూర్: ముత్యంపేట శివారు నిజాం షుగర్ ఫ్యాక్టరీలో కాపర్ ప్లేట్స్ చోరీ చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన మనేపల్లి పురుషోత్తం, అబ్దుల్ రహీం, మేకల తరుణ్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. కష్టపడి పనిచేయడం ఇష్టం లేక సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో దొంగతనాలు చేయాలనుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 11న నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఫెన్సింగ్‌ను కట్ చేశారు. లోపలికి వెళ్లి, కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లారు. ఇలా నాలుగైదు రోజులు ప్లేట్లను తీసుకెళ్లి, ఓ రహస్య ప్రాంతంలో ఉంచారు. గురువారం 80 కిలోల కాపర్ ప్లేట్లను బోధన్‌లో విక్రయించడానికి పురుషోత్తం, తరుణ్‌లు కారులో, రహీం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో ఒబులాపూర్‌లో ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వీరి కారు అనుమానాస్పదంగా కనిపించడంతో పురుషోత్తం, తరుణ్‌లను అదుపులోకి తీసుకొని, విచారించగా నేరం ఒప్పుకున్నారు. వెంటనే ద్విచక్ర వాహనంపై వచ్చిన రహీంను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కాపర్ ప్లేట్లు, బైక్, కారు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్, ఏఎస్సై లచ్చయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, కోటేశ్వర్‌రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవు మృతి



మృతిచెందిన ఆవు

ధర్మపురి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ ఆవు తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురిలో వొజ్జల ప్రవీణ్‌కుమార్ శాస్త్రికి చెందిన ఆవు గురువారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ బస్సును ఆపకుండా జగిత్యాల వైపు వెళ్లగా స్థానిక విశ్వహిందూ పరిషత్‌కు చెందిన గాజు భాస్కర్ తదితరులు వెంబడించినా పట్టుకోలేకపోయారు. తనకు సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిచే ఆవును ఖననం చేయించారు. రోడ్లపై పశువులు తిరగడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, జీవాలను ఇళ్ల వద్దే ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ సూచించారు.

- దివ్యాంగ ఓటర్ల గుర్తింపునకు సర్వే
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు
- జిల్లాలో ఓటర్లు 10 వేల మంది ఉంటారని అంచనా

సవ్యంగా ఓటేసేలా..

జిల్లా సమాచారం	
మున్సిపాలిటీలు	5
మండలాలు	20
గ్రామాలు	380
మొత్తం ఓటర్లు	7,94,458
పురుషులు	3,84,772
మహిళలు	4,09,666
ట్రాన్స్‌జెండర్లు	20



ఓటరు జాబితా ఆధారంగా దివ్యాంగుడి వివరాలు సేకరిస్తున్న బీఎల్వో

కథలాపూర్(వేములవాడ): కొద్దిరోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఓటింగ్ శాతం పెంపే లక్ష్యంగా ఎన్నికల సంఘం అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి కొత్తగా జిల్లావ్యాప్తంగా ఉన్న దివ్యాంగ ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించి వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఎన్నికల వేళ దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవడం, పోలింగ్ కేంద్రాలకు వెళ్లగలిగేవారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. దీనికోసం దివ్యాంగ ఓటర్లను గుర్తించే ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ఇంటింటా తిరిగి వివరాలు సేకరిస్తున్నారు.

వివరాల సేకరణలో బీఎల్వోలు

ఆసరా పింఛన్ల లబ్ధిదారుల్లో దివ్యాంగులు జిల్లాలో 17,405 మంది ఉన్నారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల బీఎల్వోల వద్ద ఓటరు జాబితాలున్నాయి. ఆసరా పింఛన్ జాబితాతోపాటు ఓటరు జాబితా ఆధారంగా బీఎల్వోలు ఇంటింటా తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. కాగా ఆసరా పింఛన్లు తీసుకుంటున్నవారిలో 18 ఏళ్ల పైబడి ఓటు హక్కు ఉన్నవారు సుమారు 60 శాతం మంది ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. కొందరు దివ్యాంగులైనప్పటికీ ఆసరా పింఛన్లు మంజూరు కానివారు ఉండటంతో ఇంటింటా సర్వేతో సమగ్ర వివరాలు తెలుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

సౌకర్యాల ఏర్పాటుకు..

దివ్యాంగుల్లో అసలే నడవడానికి వీలుకానివారుంటే వారి కోరిక మేరకు పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు. వీటితోపాటు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల నిర్మాణం, ట్రై సైకిళ్ల వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. దివ్యాంగుల సంఖ్య ఎక్కువగా ఉంటే పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కొత్త ఓటుహక్కు దరఖాస్తులతోపాటు దివ్యాంగులను గుర్తిస్తూ అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయమై కథలాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో దివ్యాంగ ఓటర్ల గుర్తింపునకు సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాలని బీఎల్వోలకు సూచించామని తెలిపారు.

సంతోషకరం



ఇన్నాళ్లు పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సరైన వసతులు లేక ఓటుహక్కు వినియోగించుకోవాలంటే కష్టంగా ఉండేది. పోలింగ్ రోజు అధికారులు, నాయకుల సందడి వల్ల కేంద్రాల వద్ద ఉద్రిక్తత వాతావరణం ఉంటుంది. దీంతో దివ్యాంగులు ఓటు వేసేందుకు వచ్చినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళిక తయారు చేయడం సంతోషకరం.

– గుగ్లోత్ రవినాయక్, జాతీయ దివ్యాంగుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

సమయం కేటాయించాలి



దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అనుమతి ఇవ్వాలి. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు నిర్మించి ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచుతున్నారు. మిగతా ఓటర్లతోపాటు క్యూ లైన్‌లో ఉండటం దివ్యాంగులకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రత్యేక సమయం కేటాయించి నేరుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వెసులుబాటు కల్పిస్తే బాగుంటుంది.

– అబ్దుల్ అజీజ్, దివ్యాంగుల జేఏసీ జిల్లా కన్వీనర్

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని సిద్దిపల్లె పంచాయతీ పరిధి శాలపల్లెకు చెందిన బిల్లా భూమయ్య(55) ట్రాలీ ఆటో ఢీకొని, మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. భూమయ్య పని నిమిత్తం గురువారం తన ద్విచక్రవాహనంపై రొంపికుంట గ్రామానికి వెళ్లి, వస్తున్నాడు. శాలపల్లె వద్ద పెంచికల్‌పేట నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ఘటనలో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



దుర్గాప్రసాద్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): స్థానిక వినోభానగర్‌కు చెందిన అట్లూరి దుర్గాప్రసాద్(32) ఆత్మహత్య చేసుకున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం అతని భార్య ఇంట్లో లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జ్యోతినగర్(రామగుండం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎన్టీపీసీ పోలీసుల వివరాల ప్రకారం.. గౌతమినగర్ రోడ్డుపై గత మార్చిలో కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో రామగుండంకు చెందిన ఐలి శ్రీధర్(40)కు గాయాలయ్యాయి. అప్పటినుంచి ఇంటివద్దే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ స్నేహిత్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపేట నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరించాలి

రాయికల్: జగిత్యాల డిపోకు చెందిన కొత్తపేట నైట్‌హాల్ట్ బస్సు ఏడాదిగా నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయికల్ పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాలకు చెందినవారు పనుల నిమిత్తం జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి ప్రతీరోజు రాత్రి 9.30 గంటలకు నైట్‌హాల్ట్ బస్సు ద్వారా తమ గమ్యస్థానాలకు చేరేవారు. ప్రస్తుతం నడవకపోవడంతో అధిక డబ్బులు చెల్లించి, ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు స్పందించి, బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ రమణకు పరామర్శ



ఎమ్మెల్సీని పరామర్శిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు సంజయ్, రవిశంకర్

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్లీరామ్ ఇటీవల మరణించగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి తదితరులున్నారు.

సన్మానం



సన్మానిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జగిత్యాల: సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందడం వెనుక పీఆర్టీయూ సంఘ బాధ్యుల పాత్ర ఎంతో ఉందని సమగ్ర శిక్ష ఉద్యోగులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందరావును సన్మానించారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, ప్రశాంత్, గంగారెడ్డి పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్టు



దొంగల అరెస్టు చూపుతున్న సీఐ జగదీశ్

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ జగదీశ్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెండేయ కాలనీలో రెండు కిరాణా దుకాణాల్లో ఇటీవల చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వేముల చంద్రప్రకాశ్, ఏర్ల చైతన్య(మార్కండేయ కాలనీ), బుడిమ ఓదెలు(గడిమహల్), ఒజ్జ రణదీప్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. మరో ఇద్దరు కోట అభిలాష్, వనపర్తి వెంకటేశ్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. దొంగల వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై విజేందర్, ఏఎస్సై తిరుపతి, హెచ్‌సీ తిరుపతిరావు, కానిస్టేబుళ్లు తిరుపతినాయక్, కిరణ్, శ్రీనివాస్‌లను అభినందించారు.

కారుతో బైక్‌ను ఢీకొట్టిన వ్యక్తి..

సారంగాపూర్: కారుతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, ఓ వ్యక్తి గాయపడేందుకు కారణమైన పెంబట్ల వాసిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెంబట్ల గ్రామానికి చెందిన రాజశేఖర్, కోనాపూర్ గ్రామానికి చెందిన ఉదయ్‌ల మధ్య పాత కక్షలున్నాయి. ఇటీవల ఓ విషయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. ఇది మనసులో పెట్టుకున్న రాజశేఖర్ ఇటీవల ఉదయ్ బైక్‌పై వెళ్తుండగా వెనక నుంచి కారులో వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉదయ్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, గురువారం రాజశేఖర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొండగట్టు చోరీలో ప్రధాన నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

మల్యాల(చొప్పదండి): కొండగట్టు దేవస్థానంలో గత ఫిబ్రవరిలో జరిగిన దొంగతనం కేసులో ప్రధాన నిందితుడు రామారావు జాదవ్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. మల్యాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. చోరీ చేసిన జాదవ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలుగా విడిపోయి గాలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన మల్యాల సీఐ కోటేశ్వర్, మల్యాల ఎస్సై అశోక్, కొడిమ్యాల ఎస్సై వెంకట్రావులను డీఎస్పీ అభినందించారు.